క్లుప్తంగా

రైతులను ఆదుకోవాలి

మండపేట: ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. రంగుమారిన, మొలకలు వచ్చిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలన్నారు. పంట నష్టం అంచనా వేసి త్వరితగతిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. ఈ మేరకు టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే వేగుళ్ల మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

కాజులూరు: కాకినాడ, కోటిపల్లి రహదారిలో గొల్లపాలెం వద్ద మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. జగన్నాథపురానికి చెందిన బత్తుల విజయ్‌కుమార్ తన బైక్‌పై ద్రాక్షారామ స్నేహితుల ఇళ్లకు వెళ్లి తిరిగి వస్తున్నారు. గొల్లపాలెం పాల్కాని చెరువు మలుపు వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి పోయింది. ఈ సంఘటనలో విజయ్‌కుమార్ తీవ్ర గాయాలపాలవగా స్థానికులు గమనించి అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలంలోని అన్నాయిపేట, నెలపర్తిపాడు గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఒక్కొక్క వలంటీర్ పోస్టులకు జిల్లా జాయింట్ కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అదే గ్రామానికి చెందిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కాంగ్రెస్ తీరును నిరసిస్తూ హనుమాన్ చాలీసా



హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సభ్యులు

మండపేట: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తీరును నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయా సంస్థల సభ్యులు మంగళవారం స్థానిక రథం గుడి వద్ద హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ మండపేట ప్రఖండ అధ్యక్షుడు గాడేపల్లి షణ్ముఖ శ్రీనివాస్ మాట్లాడుతూ సేవ, సురక్ష, సంస్కార్ కోసం, దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తున్న భజరంగదళ్‌ను కాంగ్రెస్ పార్టీ ఉగ్రవాద సంస్థతో పోల్చిందని ఖండించారు. కాంగ్రెస్ తీరుకు నిరసనగా భజరంగ్‌దళ్ పిలుపు మేరకు హనుమాన్ చాలీసా పారాయణ చేశామన్నారు. బలిరెడ్డి సత్యనారాయణ, ఎం కృష్ణ, కడియాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు

రామచంద్రపురం రూరల్: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో రూరల్ మండలంలో మండలం ఫస్ట్, సెకండ్ వచ్చిన హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పులిదిండి సంజయ్‌రామ్(572), వలివేటి భాగ్యశ్రీ (563)లను గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు మంగళవారం పంచాయతీ ఆవరణలో ఘనంగా సత్కరించారు. వారికి భగవద్గీత గ్రంథాలను బహుమతులుగా అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందిస్తున్న తోడ్పాటు హర్షించదగిందన్నారు. మండల స్థాయిలో తమ ఊరి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచడం గర్వకారణంగా పేర్కొన్నారు. విద్యార్థుల ఉన్నతికి కారణమైన పాఠశాల ప్రధానోపాధ్యాయిని గోర్స లక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సీహెచ్ భాస్కరలక్ష్మి, వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి పాటుపడాలి

మండపేట: క్షేత్రస్థాయిలో బూత్, శక్తి కమిటీలు నియామకం ద్వారా సంస్థాగతంగా బీజేపీ బలోపేతానికి పార్టీ నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ కన్వీనర్ చాట్రాతి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు. పార్టీ నాయకులు ఇళ్ల వెంకటేశ్వరావు, కోటిపల్లి సాయిరాం, కోన సత్యనారాయణ, మద్దుల సుబ్బారావు, గొడవర్తి రామచంద్రరావు, రాయి వీర్రాజు పాల్గొన్నారు.

అమ్మ కడుపు చల్లగా...

- తల్లీ బిడ్డల సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం కృషి
- లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు
- రెండు నియోజకవర్గాల్లో మెరుగుపడిన వైద్యసేవలు

కపిలేశ్వరపురం: మాతా, శిశు సంరక్షణే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయి. ఆయా ప్రభుత్వాల పరిధిలోని సంక్షేమ పథకాలను, చట్టాలను పటిష్టంగా అమలు చేస్తున్నాయి. లింగ భేద భావనతో కడుపులో బిడ్డను చిదిమేసేందుకు కారణమయ్యే గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీపీఎన్‌డీటీ) చట్టం పటిష్ట అమలుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయి. ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలందించడంతో పాటు కిల్కారీ సేవల పేరుతో గర్భిణి, బాలింతలను ఫోన్ ద్వారా యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ వారి సంరక్షణకు కృషి చేస్తున్నాయి.

పటిష్టమైన చట్టం బిడ్డకు శ్రీరామరక్ష

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం- 1994 అమలు కడుపులోని బిడ్డకు శ్రీరామరక్ష. బిడ్డను చిదిమేసే ఆలోచన ఎవరికి వచ్చినా శిక్షకు సిద్ధంగా ఉండాలని ఈ చట్టం చెబుతుంది. ప్రభుత్వం వద్ద లైసెన్స్ పొందిన స్కానింగ్ సెంటర్లు నిబంధనలను మీరితే చర్యలు తీసుకొంటుంది. అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్టరీత్యా నేరం. అలా చేస్తే స్కానింగ్ సెంటర్ లైసెన్స్ రద్దు కావడంతో పాటు వైద్యులపై కేసు నమోదు చేస్తారు. నేరం రుజువైతే మూడేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉందని చట్టం చెబుతోంది.

రెండు నియోజకవర్గాల్లో స్కానింగ్ సెంటర్లు ఇలా..

గర్భంలోని పిండం ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రభుత్వం ఏరియా ఆసుపత్రి, సీహెచ్‌సీలలో స్కానింగ్ పరికరాలను సమకూర్చింది. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి, కపిలేశ్వరపురం, మండపేట, ఆలమూరు, కొత్తపేట సీహెచ్‌సీలలో స్కానింగ్ పరికరాలు ఉన్నాయి. అవి కాకుండా రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో మూడు చొప్పున ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి.

అవగాహన కార్యక్రమాలు ఇలా

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడంలో గల నష్టాలను వివరించడంతో పాటు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం- 1994 చట్టం అమలు పరిధిని వివరిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేస్తున్నట్టు తెలిస్తే 18004253365 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసే ఏర్పాటు చేశారు. ప్రజల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు.



అంగర పీహెచ్‌సీలో గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ (ఫైల్)

డెకాయ్ ఆపరేషన్లు

భ్రూణ హత్యలు, లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 1994లో ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీ నాటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (పీసీపీఎన్‌డీటీ) చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, భ్రూణ హత్యలు చేయడం నేరం. చట్టం అమలులో భాగంగా డెకాయి ఆపరేషన్ పేరుతో మూడు నెలలకు ఒకసారి స్కానింగ్ సెంటర్లను అధికారులు తనిఖీ చేస్తున్నారు.

తల్లీబిడ్డా రక్షణకు కిల్కారీ సేవలు

కిల్కారీ అనే హిందీ పదానికి చిన్నారి చిరునవ్వు అని అర్థం. వైద్యసేవలందించడంతో పాటు ఇంటి వద్ద ఉన్న గర్భిణి, బాలింతలకు ఫోన్ ద్వారా యోగ క్షేమాలను అడిగి తెలుసుకోవడం కిల్కారీ సేవ లక్ష్యం. గర్భం దాల్చిన నాలుగో నెల నుంచి కిల్కారీ సేవలు ప్రారంభం అవుతాయి. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆరోగ్య నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై వారిని అప్రమత్తం చేయడం కార్యక్రమ లక్ష్యం. గర్భిణులు బాలింతలకు నేరుగా మహిళా డాక్టర్ ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీసి ధైర్యం చెప్తారు. అందుకోసం గర్భిణి, బాలింతల వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. దీనిపై వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు ఫిబ్రవరిలో శిక్షణ ఇచ్చారు.

మాతా శిశు సంరక్షణ నిలయం ప్రభుత్వ ఆసుపత్రి



మాతా శిశు సంరక్షణకు నిలయంగా ప్రభుత్వ ఆసుపత్రులు నిలుస్తున్నాయి. గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పూర్తిగా కోలుకునే వరకూ క్రమ పద్ధతిలో వైద్య పరీక్షలు చేస్తూ తల్లీ బిడ్డలను సంరక్షించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేస్తుంది. అందుకోసం వైద్యులు, వైద్యఆరోగ్య, ఆశ కార్యకర్తలంతా శ్రమిస్తున్నారు. – పి.రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం

97 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



అంగరలో గర్భిణిని పరీక్షిస్తున్న సీనియర్ వైద్యురాలు కన్యాకుమారి

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, అచ్యుతాపురం, వాకతిప్ప పీహెచ్‌సీలలో మంగళవారం 97 మంది గర్భిణులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులను అందజేశారు. వారిలో 27 మందిని హైరిస్క్‌గా గుర్తించి మెరుగైన పరీక్షలకు సిఫార్సు చేశారు. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు పీఎస్‌ఎస్‌డీ రత్నకుమారి పి.చంద్రమౌళి, కరుణేంద్ర కుమారి పర్యవేక్షణలో పరీక్షలు చేశారు. అంగర పీహెచ్‌సీలో సీనియర్ వైద్యురాలు కె.కన్యాకుమారి 37 మంది గర్భిణులను పరీక్షించారు. 9 మందిని హైరిస్క్‌గా గుర్తించారు. గ్రామానికి చెందిన వ్యాపారవేత్త రాగం రామచంద్రరావు గర్భిణులకు బిస్కెట్లు, ఆపిల్ జ్యూస్ డ్రింక్స్ అందజేశారు. వాకతిప్ప పీహెచ్‌సీలో పి.చంద్రమౌళి 15 మందిని పరీక్షించగా ఐదుగురుని హైరిస్క్‌గానూ, అచ్యుతాపురం పీహెచ్‌సీలో కరుణేంద్రకుమారి 45 మందిని గుర్తించగా 13 మందిని హైరిస్క్‌గా గుర్తించారు.

రాజ్యాధికారం దిశగా సాగడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న చిన్న సుబ్బారావు

మండపేట: ఎస్సీ వర్గీకరణ సాధనకు, రాజ్యాధికారం లక్ష్యంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) పనిచేస్తుందని ఆ సంస్థ ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన్నసుబ్బారావు అన్నారు. కోనసీమ జిల్లా ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల కార్యకర్తల సమావేశం రాష్ట్ర నాయకుడు దూలి జయరాజు అధ్యక్షతన మంగళవారం స్థానిక బాబూ జగ్జీవన్‌రావు కమ్యూనిటీ హాలులో జరిగింది. ఈ సందర్భంగా చిన్న సుబ్బారావు మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు నమ్మించి మోసగించాయన్నారు. ఇకపై ఏ పార్టీని నమ్మేది లేదని, స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదిగేందుకు మందా కృష్ణమాదిగ మహాజన సోషలిస్ట్ పార్టీని స్థాపించారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు యాళ్లగడ్డ సత్తిబాబు మాట్లాడుతూ మామిడికుదురులో ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఈనెల 25న మందా కృష్ణమాదిగ ఆవిష్కరించనున్నారని అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సంఘ నాయకులు గాలింకి నాగేశ్వరరావు, నేదురి రాజేష్, సవరపు భైరవమూర్తి, సవరపు సతీష్, చాపల వీరబాబు, షేక్ నబి, ఆకుమర్తి భాస్కరరావు, పలివెల లోవరాజు, లంక రామకృష్ణ, గంధం యాకోబు తదితరులు పాల్గొన్నారు.

కాలువ గట్టుపై ఆక్రమణలు



షెల్టర్ లేక రోడ్డుపైనే ప్రయాణికుల పడిగాపులు

- నిలువనీడ లేక ప్రయాణికుల అవస్థలు

మండపేట: మండలంలోని ద్వారపూడి - జెడ్.మేడపాడు కెనాల్ రోడ్డులో కాలువగట్టు ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారింది. రోడ్డు మార్జిన్‌ను సైతం ఆక్రమించేస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర అగచాట్లు పడాల్సి వస్తోంది. జెడ్. మేడపాడు వంతెనపై కొందరు ఎంతో కాలంగా పాన్, స్వీట్స్, సర్వీసింగ్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. అంతటితో ఆగకుండా ఇటీవల మరింతగా ముందుకు వచ్చి రోడ్డు మార్జిన్‌ను సైతం ఆక్రమించేశారు. ఒకరికి పోటీగా మరొకరు రోడ్డుకు ఇరుకు వైపుల షాపుల వారు రోడ్డు మార్జిన్‌పైకి తమ బడ్డీలు, బల్లలను ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు.

ప్రయాణికుల అగచాట్లు

సామర్లకోట–రాజమహేంద్రవరం కెనాల్ రోడ్డులోని జెడ్. మేడపాడు వంతెన వద్ద ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుంది. స్థానికులతో పాటు మండపేట, రాజానగరం మండలం పరిధిలోని పలు గ్రామాల వారు రాజమహేంద్రవరం, సామర్లకోట వైపు వెళ్లేందుకు ఈ సెంటర్‌కు చేరుకుంటారు. ఆటోలు, బస్సుల ద్వారా ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికుల కోసం వంతెనపై బస్సు షెల్టర్ లేకపోవడంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ అగచాట్లు పడాల్సి వస్తోంది. గర్భిణులు, వృద్ధులు, చిన్నారుల అవస్థలు వర్ణనాతీతం. వారంతా గతంలో రోడ్డు మార్జిన్‌లో నిల్చుని బస్సులు, ఆటోల రాకపోకల కోసం ఎదురు చూసేవారు. వ్యాపారులు మార్జిన్‌ను సైతం ఆక్రమించి వేయడంతో ఏకంగా రోడ్డు పైనే నిల్చుని ఎదురు చూడాల్సి వస్తోంది. వాహనాలు దూసుకు వచ్చే సమయంలో పక్కకు వెళ్లేందుకు వీలులేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలు తొలగించి ప్రయాణికుల కోసం షెల్టర్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎండబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



తాళ్లపాలంలో ఉపాధి హామీ కూలీలు, అధికారులకు సూచనలు చేస్తున్న ఎంపీపీ భవాని

రామచంద్రపురం రూరల్: ఉపాధి హామీ కూలీలు పని సమయంలో ఎండబారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని సూచించారు. మండలంలోని తాళ్లపాలం, ఉట్రుమిల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. ఉపాధి కూలీలు ఎండబారిన పడకుండా ఉండాలని కోరారు. పనిలో నాణ్యత తగ్గకుండా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్టా గోవిందు, ఉప సర్పంచ్ వల్లు శివ, ఎంపీటీసీ పంపన ఏడుకొండలు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అయ్యల రాంబాబు, ఏపీఓ జి.అరుణకుమారి, ఫీల్డ్ అసిస్టెంట్లు రమాకుమారి, జ్యోతి పాల్గొన్నారు.

ఏడుకొండలుకు టైలర్ల సంఘం సాయం



అగ్ని ప్రమాద బాధితుడికి మెషీన్, తదితర టైలరింగ్ సామగ్రి అందజేసిన టైలర్ల అసోసియేషన్ నాయకులు

రామచంద్రపురం రూరల్: గత నెల 23 న ద్రాక్షారామ బల్లగేటులో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన టైలర్ విప్పర్తి ఏడుకొండలుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముగ్గల మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి దొంగ సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు మాధవరపు కనకదుర్గ, గుత్తుల నాగరాజు, జక్కంశెట్టి స్వామిలు జిల్లా మాజీ అధ్యక్షుడు వాడపర్తి కామేశ్వరరావు ద్వారా దాతల సాయంతో కొత్త మెషీన్‌లు, సామగ్రిలను మంగళవారం అందజేశారు. ఫోల్డింగ్ మెషీన్, ఓవర్‌లాక్ మెషీన్, కటింగ్ టేబుల్, కత్తెర్లు, సేళ్లు, ఐరన్ బాక్స్ తదితర సామానులను అందించి మళ్లీ నూతనంగా పని ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, ఎస్ నబీ, కొసనా కామేశ్వరరావు, కేసనకుర్తి భద్రరావు తదితర టైలర్లు పాల్గొన్నారు.

నష్ట నివారణపై రైతులు శ్రద్ధ వహించాలి

కాజులూరు: భారీ వర్షాలకు నష్టపోయిన వరి పంటను సంరక్షించుకోవడంలో రైతులు తగిన శ్రద్ధ వహించాలని ఏవో వి.అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం తదితర గ్రామాల్లో వ్యవసాయాధికారులు పర్యటించి వరి పొలాలను, ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్యావటంలో ఆయన మాట్లాడుతూ గత వారంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలో అధిక శాతం పొలాలు నీట మునగగా ఈదురుగాలులతో కూడిన వర్షాలకు పలు చోట్ల పంట నేలనంటిందన్నారు. తడిసిన పంట గింజ మొలకలు రాకుండా ఉండేందుకు లీటర్ల నీటికి 50 గ్రాముల ఉప్పును కలుపుకుని పంటపై పిచికారి చేయాలన్నారు. పొలాల్లోని ముంపు నీరు బయటకు పోయేందుకు చిన్నచిన్న బోదెలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పంటకాలం పూర్తయిన కారణంగా వీలైనంత త్వరగా మాసూళ్లు పూర్తి చేయాలని లేని పక్షంలో గింజ రాలిపోయే ప్రమాదం ఉందన్నారు. పనల రూపంలోనూ, ధాన్యం రూపంలోనూ ఉన్న పంటను ఒడ్డుకు చేర్చి ఆరబెట్టుకోవాలన్నారు. వీఏఏలు రమ్య, శిరీష, అనుషా, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు నిత్య విద్యార్థులుగా ఉండాలి

రామచంద్రపురం: న్యాయవాదులు నిత్య విద్యార్థులుగా ఉంటూ ప్రాక్టీసును అభివృద్ధి చేసుకోవాలని రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ అన్నారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ భవనంలో మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జడ్జి నాగేశ్వరరావు నాయక్‌కు స్వాగత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏజీపీ పిల్లి మురళీమోహన్ వెంకటరమణ ఆయనకు పూలమొక్కను అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ బార్ అండ్ బెంచ్‌కు సత్సంబంధాలు కొనసాగేలా న్యాయవాదులు పనిచేయాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవిదేవి మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు సీనియర్ల వద్ద ప్రాక్టీసులో మెళకువలు తెలుసుకోవాలన్నారు. ప్రాక్టీసులో అలసత్వం లేకుండా అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం బార్ అసోసియేషన్‌కు మాజీ అధ్యక్షుడు సాలగ్రామ శ్రీనివాస సుబ్రహ్మణ్యం(బినయ్‌బాబు) బహూకరించిన ఇన్వర్టర్‌ను జడ్జి కె.మాధవీదేవి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, డీఎస్ఎస్ శర్మ, మహిళా న్యాయవాదుల ప్రతినిధి కేవీ సత్యవాణి, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృథ్వీరామయ్య, సహాయ కార్యదర్శి చిన్నం రెడ్డి, కోశాధికారి జేఎస్ఎస్ చక్రవర్తి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సృజన కళలు



కపిలేశ్వరపురం గ్రంథాలయంలో అల్లికలపై శిక్షణ ఇస్తున్న రీసోర్స్ పర్సన్

కపిలేశ్వరపురం: ప్రభుత్వం చేపట్టిన వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహణలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో మంగళవారం సృజన కళలను విద్యార్థులకు నేర్పారు. రీసోర్స్‌పర్సన్ లక్ష్మి ఆధ్వర్యంలో సుమారు 30 మంది విద్యార్థులకు అల్లికలు ఇతర క్రాఫ్ట్ వస్తువులను తయారు చేయడం నేర్పారు. గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, కథలు రాయడం, చదవడం తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు.

ఘనంగా గండర దీపోత్సవం

అయినవిల్లి: మండలంలోని కొండుకుదురులో కొలువైన ఆర్ల అక్కమ్మకు మంగళవారం తీర్థం నిర్వహించారు. ఆర్ల అక్కమ్మకు పెద్ద ఎత్తున భక్తులు గండర దీపాలు సమర్పించారు. ఈ దీపాలను పళ్లెంలో ఉంచి భక్తులు శిరస్సున ఎత్తుకుని గ్రామ వీధుల్లో ఊరేగారు. మొక్కుల రూపంలో అమ్మవారికి గండర దీపాలు, దండుగమ్మ కావెళ్లు సమర్పించారు.

అధైర్యపడొద్దు .. ప్రభుత్వం అండగా ఉంది



అంగరలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

- జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

కపిలేశ్వరపురం: వర్షాలకు వరిపంట దెబ్బతిన్నప్పటికీ రైతులు అధైర్య పడొద్దని, ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి కె.నాగేశ్వరరావు ధైర్యం చెప్పారు. అంగరలోని వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. వరికంకులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రహదారులపై ఆరబెట్టిన ధాన్యం నాణ్యతను చూశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఆర్బీకే ద్వారా కొనుగోలు చేసి రైసుమిల్లులకు తరలించేందుకు ప్రభుత్వ శాఖల యంత్రాంగమంతా శ్రమిస్తోందన్నారు. ధాన్యం తరలింపు ప్రక్రియపై తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డిలను ఆయన అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్బీకే వ్యవసాయ సహాయకురాలు సాయిప్రియ, వీఆర్వో పెద్దింశెట్టి నాగమణి ఉన్నారు.

ధాన్యం రవాణా పరిశీలన

కె.గంగవరం: మండలంలోని యండగండి, కె.గంగవరం గ్రామాల్లో మంగళవారం ధాన్యం రవాణాను జిల్లా వ్యవసాయాధికారి కె.నాగేశ్వరరావు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోత కోసి ధాన్యం ఆరబెట్టిన రైతులందరూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మకాలు జరపాలని సూచించారు. ముఖ్యంగా యంత్రాలతో వరి నుంచి ధాన్యాన్ని వేరు చేసేటప్పుడు శ్రద్ధ వహించాలని కోరారు. ధాన్యంలో పొట్టు ఎక్కువగా ఉంటుందని యంత్రాలతో ధాన్యం ఆడేటప్పుడు మెషీన్‌లోని ఫ్యాన్ స్పీడు అధికంగా ఉండేలా చూడాలన్నారు. కె.గంగవరంలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించి డ్యామేజీగా నమోదు చేయాలని ఏఓ రవికి సూచించారు. అనంతరం పంట కోత ప్రయోగం పడిపోయిన పంట పొలాలను పరిశీలించారు.

ఘనంగా వెదురుపాక పోలేరమ్మ తీర్థం



పోలేరమ్మ అమ్మవారు

రాయవరం: మండలంలోని వెదురుపాక గ్రామంలో కొలువుదీరిన పోలేరమ్మ వారి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. తమ పుసుపు కుంకాలు, పాడిపంటలు, పిల్లాపాపలను చల్లగా చూడాలంటూ మహిళలు అమ్మవారికి చీర, జాకెట్టు, పిండివంటలు నైవేద్యాలను సమర్పించారు. ఏటా అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా పోలేరమ్మ, బంగారమ్మ, మహాలక్ష్మి, దుర్గమ్మ, దండిగరిక అమ్మవార్ల ప్రతిరూపాలైన గరగలను పుట్టింటికి తీసుకుని వచ్చారు. ఆయా పుట్టింటివారు అమ్మవారికి వడికట్టు కట్టి పూజలు చేశారు. విజయదుర్గా పీఠాధిపతి గాడ్ కుమార్తెలు గాదె సత్యవెంకట కామేశ్వరి, పెదపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమలు విశేష పూజలు నిర్వహించి, అమ్మవారికి వడికట్టు కట్టారు. వెదురుపాక పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, నైవేద్యాలు సమర్పించుకున్నారు. సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి, ఎంపీటీసీలు మండ వెంకటపద్మావతి, వాసంశెట్టి రామలక్ష్మి, అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నేతలు అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

జెడ్పీ మాజీ వైస్ చైర్మన్‌కు సతీవియోగం



చింతపల్లి వీరభద్రరావును పరామర్శిస్తున్న ఎంపీ బోస్ తదితరులు

రామచంద్రపురం రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్, రామచంద్రపురం మండల మాజీ ఎంపీపీ చింతపల్లి వీరభద్రరావు సతీమణి చింతపల్లి సీతాదేవి(73) మంగళవారం సాయంత్రం కన్నుమూశారు. ఆమె మృతికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సంతాపం తెలిపారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, బోస్ తనయుడు సూర్యప్రకాశ్, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు దామిశెట్టి గంగాపురుషోత్తం, గరికిపాటి సూర్యనారాయణ, కొమరిన వీర్రాజు, సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, మాజీ సర్పంచ్ పచ్చిపాల బుజ్జి, నాయకులు చింతపల్లి అర్జున్, కంచుమర్తి బాబూరావు తదితరులు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆమె అంత్యక్రియలు బుధవారం స్వగ్రామం హసన్‌బాదలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వెంకన్న సన్నిధిలో 'వసంత' పూజలు



ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ దంపతులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చైర్మన్ ఎమ్మెల్యేకు స్వామి చిత్రపటం అందించారు.